

# కాకమ్మకథ

ఇందుర్తి సత్యన్నారాయణరావు



అదేం ప్రారబ్ధమోగాని రంగమ్మగారికి మంచి శకునాలేవీ సత్ఫలితాలను ప్రాప్తింపజేయకున్నా, చెడు శకునాలు మాత్రం, శాస్త్రాలు చెప్పిన ప్రకారం చెడ్డ ఫలితాలను కలగజేస్తుంటాయి.

అంచేత — ఉదయం లేచింది మొదలుకొని, ఆమె ఆ కాకిని నానారకాలుగా తిట్టిపోస్తున్నది. రామాయణంలో సీతమ గాయపర్చి, రాముడి బ్రహ్మాస్త్రానికి గురైన కాకితో మొదలుపెట్టి— పురాణకాలం లగాయతు కాకుల బుద్ధిలాటిదేనని ఉదాహరణలు చూపుతూనే వుంది.

అయితే — ఆ కాకి గూడా ఆ మాత్రం తీసిపోకుండా — శ్రోతల కష్టసుఖాలు పట్టించుకోక, తన కర్తవ్యాన్ని తను నెరవేర్చ జూసే ఆకాశవాణిలా — తన ప్రోగ్రాంను కంటిన్యూ చేస్తూనేవుంది.

ఇహ తప్పక — రంగమ్మగారే రాజీకొచ్చింది. చుట్టాలు రాబోతువ్నారనే ఆ కాకి మెసేజీని స్వీకరించి — ''ఇదీ ఒకందుకు మంచిదేలే! ఈ కాకి కబురైనా లేకుండా బంధువులూడిపడ్తే, అప్పడప్పకోసం దేవులాడ్డమెంత కష్టం! ఈ పాడుకాకి మూలంగా, యిప్పట్నించే — నిండుకున్న సరుకుల విషయంలో జాగ్రత్తపడే అవకాశముంది'' అని గొణుక్కుంటూ, కాకి తనకు చేస్తున్న అంత చెరుపులోను కొంత మంచిని చూడసాగింది.

ఇంతలో పరంధామయ్యగారు లేచి దొడ్లో కొచ్చాడు. పళ్ళపొడుం పొట్లం అడుగునున్న పొడుం కాస్త చేతిలో వంపుకొని, ఇరవైనాల్గు పళ్ళకు ఆ క్వాంటిటీ చాల్దనే నిర్ణయానికొచ్చాడు. ప్యాకెట్‌ని చింపి కాయితం లోపల్ని అంటుకున్న పొడుంని కూడా గీకి చేతిలో వేసుకుంటూ —

''ఏవిటే! పొద్దుటే కాకి దుష్టులిస్టు చదివేస్తున్నావ్'' అనడిగాడాయన హ్యూమరస్‌గా.

''మరే మరె! ఉదయాన్నే కాసేపు అత్తింటి వైపు వార్ని గుర్తుతెచ్చుకొంటేనైనా సిరి పడుతుందేవోనని'' అంది రంగమ్మగారు కసిగా.

''హాసినీ! లేచీ లేవంగానే ఎంత దెబ్బ తిన్నానే'' అన్నవ్వుతూ నీళ్ళతొట్టె వైపు నడిచాడాయన.

ఎప్పట్లాగానే ఆయన స్పోర్టివ్‌నెస్ ఆమె కోపంపై విజయాన్ని సాధించింది. ఆమె చల్లబడింది.

''చూడండి... పొద్దుట్నించి పాడు కాకి ఒకటే అరుపు... ఎన్నిసార్లు కొట్టినా మళ్ళీవచ్చి ఒహటేగోల... ఎవరో చుట్టాలూడి పడేట్టు వున్నారు'' నిస్పృహగా చెప్పిందామె.

''హార్నీ! మన టెలెగ్రాఫు డిపార్టుమెంటు కంటె దీనికే ఎక్కువ బాధ్యతల్పులా వుందే! ఉచితంగాను, మిస్సు కొట్టకుండాను మెసేజీ

లందిస్తున్నది ... నాల్గు బియ్యపు గింజలుంటే పడ్డై పాపమా పిచ్చిముండకు !'' అంటూ కాకి వైపు ప్రశంసగా చూసాడాయన.

''నే ననేదేమిటి? మీరు చెప్తున్నదేవిటి ?'' అని రంగమ్మగారు తిరిగి గయ్యిన లేచింది.

''ఎవరో చుట్టాలొస్తారని ఆ కాకి చెబుతున్నదనేగా నువ్వనేది ... ఆ కబురందించినందుకు దాని రుణ ముంచుకోక నాలుగు గింజలు దాని కెయ్యమన్నేనంటున్నా'' అని దంతధావన కార్యక్రమంలో పడ్డాడాయన.

''ఆ నాలుగ్గింజలే వుంటే యింతిదవడమెందుకు ? కాఫీపొడుం, పంచదార లేక ఈ పూట కాఫీ కూడా పెట్టలేదు...బియ్యం నిండుకుంది. ఈ సౌభాగ్యానికి తోడు చుట్టాలు గూడా వచ్చిపడితే యికయినట్టే ! మీకేవో ఏదీ పట్టదు. ఎట్లా తెస్తారో, వెళ్లి సరుకులు పట్టంసి ! చుట్టుపక్కల వాళ్ళందర్దగ్గర్నించి పదిహేన్రోజులబట్టీ — బెల్లం, చింతపండుతో సహా ప్రతీదీ అరువు తెస్తున్నాను... ఇహందరూ ముఖానే తలుపేసే పరిస్థితొచ్చింది—'' ఆమెకు సహంలోనే దుఃఖం ముంచుకొచ్చింది, గొంతు పూడుకుపోయింది.

ఆర్థిక యిబ్బందులే లేకపోతే రంగమ్మగారు చాలా మంచి మనిషి. ఆ విషయం ఆయన గ్గూఢా తెల్సు. కాకరుస్తుందనీ, చుట్టాలొచ్చి పడతారనీ విసుక్కునే నైజం కాదావిడది.

''ఎందుకే అనవసరంగా మనసు పాడుచేసుకుంటావ్ ! కాకరిచిందని చుట్టాలొస్తారా ! లేకుంటే మనింటికి చుట్టాలొస్తారని ఆ కాక్కేమైనా కలొచ్చిందా ? చాదస్తంగ ఏవో వూహించుకొని బాధపడ్డం దేనికి ?'' అంటూ ఆమెను సముదాయించబోయారు పరంధావయ్యగారు.

''మీకు తెలియదండీ ! యిదివరకు నేనూ మీలాగే వీటి విషయం తేలిగ్గా తీసేసేదాన్నేగానీ, ఈ కాకిముండలు ప్రతిసారీ చుట్టాల్ని తెచ్చి పడేస్తున్నాయి..: మనవెంత కాదనుకున్నా చివరికి వాటి పంతమే నెగ్గుతున్నది—'' అని తిరిగి గొణగడం మొదలుపెట్టి, రాబోయే చుట్టాల ప్రయాణాని క్కారణాలన్నీ ఆ కాకి మీదకే నెట్టసాగిందామె.

ఆమె చెప్పేదాంట్లో లొసుగులు ఆయనకు తెల్సు. అంతకుమించి—

ఈ పూట కాఫీకోసం, కాఫీపొడుం, పంచదార అరువు తెచ్చేందుకు నిన్నరాత్రే ఆమె ఎవరింటికో వెళ్ళుంటుందనీ, వాళ్ళు ఇవ్వకపోగా, ఆమె మనసు బాధపడేట్టు ఏదో అనుంటారనీ కూడా ఆయన అర్థం చేసుకున్నాడు

కనుకనే కాకి విషయంలో ఆయన వాదన పెంచలేదు.

''సర్లే ! చుట్టాలొచ్చినా రాకపోయినా— బియ్యం, పంచదార లేవంటున్నావుగా ! తేవల్సినవన్నీ ఓ కాగితంమీద రాసియ్యి... ఈ పూట కాస్త డబ్బు రావల్సిందుంది... బజారు కెళ్ళి పట్టుకొస్తా'' అన్నారాయన.

''నిజవేనా ?'' అన్నట్టు చూసింది రంగమ్మగారు.

ఆయన ముఖం తిప్పకొని టంగ్‌క్లీనర్ సంపాదించుకునేందుకు, తడికవైపు నడిచాడు.

''ఎవర్నేమి లాభం ! పాడురోజులొచ్చి పడ్డై ! తిండిగ్గూడా గతిలేక పోయే కాలం కూడా చూస్తావేమోననిపిస్తున్నది- '' అంటున్నదామె.

పరంధావయ్యగారు చటుక్కున యిటు తిరిగి— ''వెళ్ళి—కావల్సిన సరుకుల లిస్టురాయి. అందులో నాలుగు నాలుక పుల్లలు గూడా చేర్చు, రోజూ తెద్దావనుకొంటూ మర్చిపోతున్నాను'' అన్నారు.

* * *

చొక్కా తొడుక్కుంటున్న పరంధావయ్యగారిచేతికి కాగితాన్నందించింది రంగమ్మగారు.

''పిల్లలు నిద్ర లేచారా ?'' అడిగాడాయన.

''శాంత యిప్పుడే లేచింది. ఇవ్వాళ కాలేజీకి సెలవు గనుక చిత్తూగాడు తొమ్మిదింటిగ్గాని లేవడు. వాడు లేచే లోపులోనైనా మీరు పంచదారా, కాఫీపొడుం తెస్తే కాఫీ పెడతాను'' మెల్లిగా చెప్పిందామె.

పరంధావయ్యగారు తలూపుతూ బైట కొచ్చారు.

చేతిలోని సరుకుల లిస్టును జేబులో పెట్టుకోగానే, ఆయన్జేబులో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అంతకు ముందు జేబులోవున్న అర్ధరూపాయి కాసున్నూజ్ఞసి, యాభై రూపాయలు డిమాండుజేసే సరుకుల లిస్టు వెక్కిరించింది. దేశ బడ్జెట్‌లోని అవసరాలను జూసి, వనరులు చిన్నబుచ్చుకున్నట్టు, అర్ధరూపాయి ముఖం పైసా అంతైంది.

దాంతో పరంధావయ్యగారి కడుపు వేగంగా కొన్ని సజెషన్ చెయ్యసాగింది — ''ఆ అర్ధ రూపాయి నెందుకలా చిన్నబుచ్చుతావ్ ! దాన్ని జేబులోంచి బైటకు తీసి, ఆ హోటలోడి ముఖాన పడేసి, నా దగ్గరికో కప్పు కాఫీ పంపు ! నీ జేబులోని సరుకుల లిస్టు గర్వమణిచే ఉపాయం చెప్పమని మెదడుకు రికమెండ్ చేస్తా'' అంటూ.

దాంతో పరంధావయ్యగారి వళ్ళుమండింది— ''ఏడిశావులేవోయ్ ఓ కడుపా ! నిన్ను చల్లారిస్తే నిద్రపో వేగాని, మెదడుకేవీ రికమెండేషన్లు చేయవన్నాకు తెల్సు ! నిన్ను మాడిస్తేనే, మెదడుకు చురుకెక్కిస్తావ్'' అనుకొని ఆయన్నవ్వుకున్నాడు.

ఎంత కష్టంలోనైనా ఇలా ఓ వెర్రి ఆలోచన్జేసుకోని ఆయన్నవ్వుకోగల్డు ... కనుకనే బతగ్గలడు కూడా !!

పరంధావయ్యగారా హోటల్ను దాటేశాడు.

తర్వాత — గురవయ్య యిల్లు సమీపించి, ఆ యింటి అరుగువైపు చూసాడాయన.

ఆయన వూహ నిజవే అయింది ! పసందైన ఆదివారపుదయం, పేకాట పురాణం పాకాన వుందప్పటికే అక్కడ. గురవయ్యతో పాటు అక్కడ చేరిన మరో నల్గురు మిత్రులకీ గురవయ్య కూతురు కాఫీలు అందిస్తుండడం కనిపించిందాయనకు.

అక్కడి కాఫీ పంపిణీ పథకం పరంధావయ్యగార్ని మనసా వాచా కర్మ ఆకట్టుకున్నది. రెండంగల్లో అక్కడికి జేరాడు.

ఆయనకు ఘనమైన స్వాగతం లభించింది.

గురవయ్య తన కూతురిచ్చిన కాఫీ గ్లాసును పరంధావయ్యగారి కందిస్తు, తనకు మరో గ్లాసు పట్టమ్మని ఆమెకు చెప్పాడు.

''వేస్తావుటోయ్ ఓ చెయ్యి'' అడిగాడో మిత్రుడు.

''ఏవిటీ స్టేకు ?''

''ఆటకి పావలా !''

పరంధావయ్యగారు వెంటనే ఆ సవాలును స్వీకరించారు. ''రెండాటలు వేస్తే, పోతే అర్ధ రూపాయి పోతుంది. తాగిన కాఫీకీ, దానికీ చెల్లు. దశ బాగుందా — మధ్యాహ్నానికల్లా స్టేకు పెంచుతూపోయి, జేబులోని లిస్టు పొగరణిచే సొమ్ము గెలవచ్చు'' అని కుతంత్రం చేసాడాయన.

అయితే— ఇలా ఆశించే జూదగాళ్లకేదైతే సాధారణంగా జరుగుతుందో, అప్పుడూ అదే జరిగింది. రెండాటల్లో అర్ధరూపాయి పోగొట్టుకొని లేచాడాయన.

''అన్నట్టు నేనో పదినిమిషాల్లో వస్తానోయ్ ! ఈ సరుకులు ఇంటికి పంపమని కొట్టువాడికి చెప్పి వచ్చేస్తా ... లేకుంటే మా ఆవిడ నానా రభసా చేస్తుంది'' అంటూ.

## ప్రగతి రథం

కదిలే కాలచక్రానికి
పరుగులిడే ప్రగతి రథానికి
నిరంతరం సాగే పరుగు పందెంలో
మానవుడే సారథిగా
మానవత్వమే మహనీయంగా
ప్రగతిరథం సాగిపోతుంది
చెరగని చక్రాల గుర్తులు చిత్రిస్తూ
చరిత్ర పుటల్లో
స్వర్ణయుగాలుగా కీర్తిస్తూ !

— యం. మధు

ఆయనలా అర్థాంతరంగా లేచిపోవడాన్ని మిగిలినవాళ్లు తీవ్రంగా ఆక్షేపించారు. 'పెళ్లాలు చేసే రభస కార్యక్రమాలు ఆటలో కూర్చునే ముందే ఆలోచించుకోవాలిగాని, యిలా మధ్యలో గుర్తు తెచ్చుకోడం ఆనవాయితీ కాద'ని కొన్ని సెక్షన్లు ఉదహరించారు కూడా.

"పోగొట్టుకున్న అర్ధరూపాయి తిరిగి గెల్చుకోందే నిద్ర పడుతుందా నాకు! క్షణంలో తిరిగి రానూ" అని తప్పించుకొని బైటపడ్డాడాయన.

అర్ధరూపాయి పోగొట్టుకొని వీధినపడ్డ పరంధావయ్యగారికి, హిమాలయాలను చేరిన సన్యాసికిలా — గొప్ప ఏకాగ్రత కుదిరింది.

ఆయన మెదడు కంప్యూటరంత ఎఫిషియన్సీతో పనిచేస్తూ — తన కప్పటికి అప్పివ్వని పరిచయస్థులెవరా అని లెక్కవేయ సాగింది.

కాసేపటికే — అక్వాలిఫికేషన్లు గలవాడెవడూ 'లేడు' అని జవాబొచ్చింది.

దాంతో ఆయనకు —

రంగమ్మగారి కన్నీళ్ళు గుర్తొచ్చాయి.

తొమ్మిదింటికి నిద్రలేచి, కొంపలో కాఫీకైనా గతిలేని దరిద్రాన్ని చూసి విలవిల లాడబోయే—బి.ఏ. చదివే కొడుకు గుర్తొచ్చాడు.

పెళ్ళి చేస్తానని, యింటర్మీడియెట్‌తో చదువాపించేయగా — "ఇప్పుడు కాఫీకి, తిండికీ నైనా సంపాదించుకు రాగలడా నా తండ్రి ... నా పెళ్ళిమాటటుంచి" అనాలోచించే కూతురు గుర్తొచ్చింది.

మూడేళ్ళలో తన కూతురుపెళ్ళి, కొడుకు చదువూ పూర్తయి తనో ఒడ్డున పడగలడను కుంటుండగా, మూడేళ్ళ ముందే తన ఉద్యోగాన్నూడలాగిన ఉద్యోగ పదవీ విరమణ వయసు తగ్గింపు ఆర్డినెన్సు చక్కదనం పదేపదే గుర్తొచ్చింది.

తను చదువుకునే రోజుల్లోనే తండ్రి చనిపోవడం, చదువుకోవల్సిన రోజుల్లోనే కుటుంబ భారం తన భుజాలపై పడడం, ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకు తను అప్పులు చేయడం, అవితీరకుండానే తల్లికి నయంకాని రోగం రావడం ... తిరిగి అప్పులు చేయడం, భార్య పురుళ్ళు, కొంపలో రోగాలు, పండుగలు, అప్పులు, పిల్లలు పెరగడం ... తిరిగి అప్పులు, ఇప్పుడు కూతురి పెళ్ళికి, కొడుకు చదువుకు కానున్న ... మరిన్ని అప్పులు ... వడ్డీలు గుర్తొచ్చాయి. ఎటు చూసినా కారు చీకట్లు... వాటిలోంచి అప్పులు, వడ్డీల కేకలు ...

ఈ సమస్యల్లో— ప్రస్తుతం యింటి క్కావల్సిన సరుకుల అవసరం చాలా చిన్నదిగా కనిపించిందాయనకు, దానికి సులభమైన పరిష్కారం తోచింది.

## కాకమ్మ కథ

టైమెంటైందోనని చేతి గడియారాన్ని ఆఖరిసారి సంప్రదించాడు. ఆ గడియారం తను షష్ఠిపూర్తి పాసైనందుకు తన తండ్రి బహుమతిగా కొనిచ్చింది. దాని విలువ రూపాయల్లో ఎంతో ?

పరంధావయ్యగారు పంకజ్‌లాల్ ఇంట్లోకి ప్రవేశించారు.

"ఆవో భాయీసాబ్ ! ఈ మధ్య నీ దర్శనమే లేదు" అని ఆహ్వానించాడు సేట్‌జీ.

కుశలప్రశ్నలైన తర్వాత పరంధావయ్యగారు తన కథ వినిపించాడు.

"లాల్ సాబ్ ! కొత్త గడియార మొకటి బేరం చేశాను ! ఈ పాత వాచీని అమ్మేయాలను కుంటున్నాను. ఎంత రేటొస్తుందో చూస్చెప్పు" అంటూ వాచీని చేతినించి తీస్తూ అడిగాడు.

చేతినించి వాచీనికాక, ఒక వేలును తీసి వేస్తున్నట్టు బాధ కల్గిందాయనకు.

> ### సర్వరుగా మరమనిషి !
>
> హోటల్ సర్వరుగా పనిచేసే ఒక మరమనిషిని జపానులోని డైనిచీకికో కంపెనీ తయారుచేసింది. ఈ మరమనిషి టేబుళ్ళ మధ్య తిరుగుతూ, వచ్చినవారికి విందు భోజనాన్ని వడ్డిస్తూ, వారడిగే చిన్న చిన్న ప్రశ్నలకు సమాధానం చెబుతూ ఉంటే వింతగానూ వినోదంగానూ ఉంటుంది. ఈ మరమనిషి కాళ్ళకు ఒక చిన్నకారు వంటి సాధనాన్ని అమర్చారు. రిమోటు కంట్రోలు ద్వారా దీనిచేత పని చేయిస్తారు. ఈ మరమనిషి ఒకేసారి మూడు ప్లేటులను మొయ్యగలదు !

"ఇవ్వాళ, లేపు వాచీలకు రేట్లేదు భాయీసాబ్ ! ఎనభై రూపాయలు పడేస్తే ఎలక్ట్రానిక్ వాచీ లొస్తున్నాయి. ఈ పాత గడియారాన్నెవడు కొంటాడు ? నువ్వు కొత్తది కొనుక్కుంటే దీన్ని నీ కొడుక్కివ్వడం మంచిదేమో !"

"వాడికీ పాతదెందుకులే లాల్‌సాబ్ ! ఏదో రేటుకు నువ్వే తీసుకో."

"సరే ! ఎవడైనా తలకు మాసిన వాడు దొరికితే వాడికి దీన్ని ఓ నలభై రూపాయల కంటకట్టచ్చేవోలే ! నీ్గనుక... నా లాభం వదులుకోని ముఫ్ఫై అయిదిస్తా... నీ కిష్టమైతే."

"సరే కానియ్ లాల్‌సాబ్ ! నే కొనే కొత్త వాచీ చెయిన్‌కైనా పని చేస్తుందిగా—"

సేట్‌జీ జాలిగా నవ్వుతూ ఆ సొమ్ము అందించాడు.

సేట్‌జీ కాయన చాలా కాలంగా తెల్సు. డబ్బులివ్వలేకపోయినా, మరే విధంగానైనా ఆయనకు సహాయపడాలని సేట్‌జీకి చాలాకాలంగా వుంది. పరంధావయ్య గారెంత నాటక మాడినా, అనుభవజ్ఞుడైన సేట్‌జీ ఆయన ఆర్థిక పరిస్థితిని అంచనా వేయగల్గాడు.

"భాయీసాబ్ ! ఏమనుకోనంటే నిన్నో విషయ మడుగుతాను... నీకు మొత్తం అప్పు లెంతుంటాయ్ ? "

ఆ ప్రశ్న వినంగానే పరంధావయ్యగారిలో విపరీతమైన మార్పొచ్చింది. రాత్రిళ్ళు తనకు నిద్ర లేకుండాను, పగలు తనను తలెత్తుకో కుండాను చేసే సమస్యల్లోంచి, తనను బైట పడవేయగల సమర్థతకల వ్యక్తి సేట్‌జీయేనని ఆయనకు వెంటనే తోచింది.

"ఇరవై వేల దాకా వుంటాయి లాల్‌జీ !" పరంధావయ్యగారి గొంతు బొంగురుపోయింది.

"భాయీసాబ్ ! నువ్వు చిన్నతనం నించి ఏ బాధ్యతలు మోసావో నాకు తెల్సు ... ఈ అప్పులు వాయిదాలు చెల్లించడానికి, వడ్డీలు కట్టడానికి నెలనెలా నీ జీతంలో సగంసొమ్ము ఖర్చయిపోతున్నదన్నాకుతెల్సు ... నీ కూతురి పెళ్లికేవీ దాచలేదనీ తెల్సు...ఔనా ? "

"అవును...యిప్పుడు దానికో యిరవై వేల దాకా అవుతుంది."

"మరేంచేయదల్చుకున్నావ్ భాయీసాబ్?"

"ఏం చేయమంటావ్ ? నేనేం చేయను?" అడిగాడు పరంధావయ్య.

భారతదేశపు ముప్పైఏళ్ళయిదు సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని, చట్టాలను, ఈ వ్యవస్థను నిల్దీసి వెర్రికేకలేస్తూ అడగవల్సిన ప్రశ్నను సిగ్గుపడుతూ, చిన్నగా అడిగాడు పరంధావయ్యగారు—"నేనేం చేయను ? "

"నీకేవి అస్తులున్నాయ్ భాయీసాబ్."

"నే నుంటున్న పాడుకొంప. దాన్నొక్కటే మా నాన్న నాకొదిలిపోయాడు."

"అబ్బా ! మంచి సమయం చూసమ్మేస్తే దానికి యిరవైవేలొస్తాయ్ ... అమ్మేయ్ భాయీసాబ్...నువ్విలా ఎంతోకాలం వెళ్లదియ్య లేవు... అకస్మాత్తుగా రిటైరైనందున నువ్వా అప్పుల వడ్డీలు యిదివరకులా కట్టలేవు. వడ్డీలు కట్టకుంటే అప్పుల వాళ్లు వూరుకోరు.. యిల్లమ్మేసి బాకీలు కట్టెయ్ ... లేకుంటే ఈ అప్పుల్తో నువ్వు ప్రశాంతంగా బతకలేవు, వడ్డీలు నిన్ను బతకనీయవు .. నా సలహా నీకు బాధ కలిగించొచ్చు. . కానీ నీకో మంచి సలహా యిప్పుడవసరమని అనిపించి చెబుతున్నా —"

"నా కూతురు... దాని పెళ్ళెలా చేయమంటావ్ లాల్‌సాబ్" బాధగా అడిగాడు పరంధావయ్యగారు.

''ప్రభుత్వానికి దయగలిగి, నీ రిటైర్మెంటు బెనిఫిట్స్ యిచ్చినప్పుడు చెయ్... మరో రెండేళ్ళు వెళ్ళదీస్తే నీ కొడుకు చదువైపోతుంది, వాడు నిన్ను పోషించినా, పోషించకున్నా పెన్షన్ డబ్బులో కాలం వెళ్ళదీయొచ్చు — నేనెందుకు చెబుతున్నానో అర్థం చేసుకో భాయీసాబ్ !''

''అర్థం చేసుకోగల్ను లాల్‌జీ ! కానీ — నా తండ్రి యిచ్చిన యింటిని, నే సంపాదించుకున్న ఉద్యోగాన్ని పోగొట్టుకొనికూడా, ఇన్నేళ్ళ బతుకులో నే మిగుల్చుకున్నదేవిటని నా మనసడిగితే ఏవని జవాబు చెప్పను ?''

''ఏమనుకోకు... నువ్వేకాదు, నీలాటి లక్షలమంది సాధించేదేవుంది ? మీ జీవితంలో ఎవరి కడుపునూ కొట్టలేదనే తృప్తి. . మీమీద పడ్డ బాధ్యతలను... మీ చెల్లెళ్ళు, తమ్ముళ్ళు, మీ సంతానాల బతుకుల్ని ఓ దారికి — మీరు నడిచిన దారికే — పెట్టామన్న గర్వం.. ఇవికాక మీరు సాధించేదేవిటి ?'' అడిగాడు సేట్‌జీ.

ఆ క్షణంలో సేట్‌జీ ఈ వ్యవస్థకు ప్రతినిధిలా కనిపించాడాయనకు.

పరంధామయ్యగారు తలవంచి సేట్‌జీకి నమస్కారం చేసి — ''ఆలోచించి చెబ్తాను లాల్‌సాబ్ !'' అంటూ లేచాడు.

* * *

''పొద్దుటనగా వెళ్ళి యిప్పుడా రావడం ?'' యిప్పుడైనా సరుకుల్తో వచ్చినందుకు కలిగిన సంతోషాన్ని ఆపుకుంటూ, కోపంగా అడిగింది రంగమ్మగారు.

''ఏం చేయనే ! దార్లో ఓ జడ్జివెధవ తగిలి ఎంతకీ వదల్లేదు —'' అని చేతిలో సంచీ ఆమె కందిస్తూ — ''పిల్లలు లేచారా ?'' అనడిగాడు పరంధామయ్యగారు.

పిల్లలు మహారాజుల్లా లేచారు. వంటింట్లో కూర్చుని తమ దరిద్రాన్ని విపులంగా ఎంట బట్టించుకుంటున్నారు కూడా.

వంటింట్లోకి అడుగుపెట్టిన పరంధామయ్యగారు వాళ్ళిద్దర్నీ చూసి గతుక్కుమన్నాడు — ''ఎంతసేపయిందర్రా లేచి ! కాఫీవేళ మించి పోలేదుగదా ?'' అంటూ ఆయన గడియారాన్ని సంప్రదించేందుకు చేయెత్తారు.

దరిద్రాన్నేగాక—పిల్లలు అప్పుడు తాజాగా—ఆయన చేతికుండవల్సిన వాచీ లేకపోవడమనే దౌర్భాగ్యాన్ని కూడా చూసారు !!

* * *

ఆ మధ్యాహ్నం —

శాంత తను రాసిన ఉత్తరాన్ని తనే ఒకసారి చదువుకున్నది.

పూజ్యులైన నాన్నగారికి —

నేను మనింటి ఎదురుగా వున్న టైలర్ అప్పారావును ప్రేమించాను. అతన్నన్ను పెళ్లి చేసుకుంటానంటున్నాడు.

అతన్ది మన కులం కాకున్నా, అతనికి నీకున్నట్టు గొప్ప 'గుమాస్తా' వుద్యోగంలేకున్నా, అతన్ని పెళ్లి చేసుకోడమే మంచిదన్నాకు తోస్తున్నది.

ఇప్పటికే అప్పుల్లో మునిగిన నీకు, నా వివాహం చేసే తాహతులేదని, అయినా యింకా అప్పులు చేసైనా నాకో గుమాస్తాను కట్టబెట్టేందుకు నువ్వు వెనుకాడవనీ తెల్సు — అందుకే అప్పారావుతో వెళ్ళిపోతున్నాను.

నన్ను అమ్మ క్షమించకున్నా నువ్వైనా క్షమించు —

నీ

శాంత !

ఉత్తరాన్ని మడిచి గూట్లో పెట్టి, ఎగిరి పోకుండా దానిమీద పౌడర్‌డబ్బా వుంచింది శాంత.

* * *

అదే మధ్యాహ్నం —

తన గదిలో — తను రాసిన ఉత్తరాన్ని ఒకసారి సరిచూసుకున్నాడు చిత్తు.

''ప్రియమైన నాన్నగారికి,

నమస్కారములు కొంతకాలంగా నేను ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్టు మీరు గమనించలేకపోయారు. కానీ ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్ళినట్టు యిప్పుడే తెల్సింది నాకు. నా కోసం వాళ్ళు ఏ క్షణాన్నైనా మనింటికి రావచ్చు. నేను అజ్ఞాతవాసంలోకి వెళ్ళి పని చేయవల్సిన సమయం వచ్చింది.

ఈ రోజు బియ్యం తెచ్చేందుకు మీరు చేతి వాచీని అమ్మేసినట్టు గమనించాను. అయితే—నేను వ్యక్తిగతంగా మీకు, మన కుటుంబానికీ చేయవల్సిన సహాయం కన్నా, ఈ సమాజానికి చేయవల్సిన సేవే చాలా ముఖ్యమైందని భావిస్తున్నాను.

ఈ వ్యవస్థలో మధ్య తరగతి, పేదవర్గాలు మరింత పేదగాను, ధనిక వర్గం మరింత ధనవంతంగాను తయారవడం చూస్తున్నాను. ఈ పరిస్థితిని ప్రతిఘటించే విప్లవాన్ని, నా చేరికతో మరో అరక్షణం ముందుకు తెచ్చినా నా జన్మ ధన్యమైనట్టు భావిస్తున్నాను.

కొద్దిగా ఆలోచిస్తే, నా మాటల్లోని నిజాన్ని మీరు గ్రహించగలరని నాకు తెల్సు. అమ్మకు నమస్కారాలు

మీ,

చిత్తరంజన్.

* * *

ఆ సాయంత్రం—

వరండాలో బియ్యం బాగుచేస్తూ కూర్చుంది రంగమ్మగారు.

ఆమెకు దగ్గరగా, పడక్కుర్చీలో కూర్చొన్నారు పరంధామయ్యగారు. గుండెకు దగ్గరగా, ఆయన జేబులో రెండు దుర్వార్తలు తెలిపే ఉత్తరాలు మంటల్ని విరజిమ్ముతున్నాయి.

పొద్దుటి కాకి యింకా అరుస్తూనే వుంది.

''ఇన్నాళ్టికి... ఈ కాకరిచినా ఎవరూ చుట్టాలు రాలేదు... షైరికాకి.. పొరపాటు పడింది—'' ఆనందించసాగింది రంగమ్మగారు.

ఆమెది మూఢనమ్మకమని రుజువైనందుకు పరంధామయ్యగారికి సంతోషం కలగలేదు. కాకరిస్తే కొత్తవారు యింటికి రాకపోగా, యింట్లోని కొడుకు, కూతురూ వెళ్ళిపోయారు!

రంగమ్మగారికి వినంగానే గుండె ఆగిపోని విధంగా ఈ దుర్వార్తలు ఎలా చెప్పాలో ఆయనకు తోచలేదు.

పడమటిదిక్కు గొంతులోకి పోతున్న సూర్యుడ్ని దీనంగా చూడసాగాడాయన. శకునాల కాకి అటువైపుకే ఎగిరిపోతున్నది ఎందుకో !

''అస్తమిస్తున్న సూర్యుడు, రేపు ఉదయించి కొత్తకాంతులు చిమ్ముతాడా ?'' అనే సందేహం కలిగిందాయనకు. ★

ఏమండీ లత వాళ్లాయనను చూస్తుంటే ట్యూషన్స్ చెబుతున్నట్లున్నారండీ!!

